క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో పెంచలప్రసాద్ ప్రతిభ



అన్నం పెంచలప్రసాద్

సైదాపురం: ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ఊటుకూరు గ్రామానికి చెందిన అన్నం పెంచలప్రసాద్ 98.39 శాతం మార్కులు సాధించాడు. అతను గూడూరులోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఇంటర్ ఫస్టియర్‌లో 470 మార్కులను గాను 458 మార్కులు సాధించా డు. తండ్రి అన్నం అశోక్ వ్యవసాయ కూలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన పెంచల ప్రసాద్‌ను గ్రామస్తులు అభినందించారు.

కల్లూరులో వైద్య శిబిరం

దొరవారిసత్రం : కల్లూరులో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని తొగరాముడి పీహెచ్‌సీ వైద్యాధికారి తరుణ్ తెలిపారు.

కండలేరులో 11.043 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 11.043 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 280 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హై లెవలల్ కాలువకు 120, లో లెవల్ కాలువకు 360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

లారీని ఢీకొన్న బైక్





గాయపడిన వంశీకుమార్, ప్రసన్న

దొరవారిసత్రం : నెలబల్లి గ్రామ సమీపంలోని తెలుగు గంగ కాలువ వద్ద బుధవారం ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. సూళ్లూరుపేటకు చెందిన వంశీకుమార్(24), ప్రసన్న(22) బైక్‌లో నాయుడుపేటకు బయలుదేరారు. నెలబల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిలో అదుపుతప్పి నిలిచి ఉన్న లారీని ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు 108 ద్వారా నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యులు నెల్లూరుకు రెఫర్ చేశారు. ఎస్ఐ తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



ఈవీఎంలను పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్, గూడూరు డీఎస్పీ

వెంకటగిరి రూరల్ : ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్ ఆదేశించారు. ఆయన బుధవారం విశ్వోదయా డిగ్రీ కళాశాలలో ఎన్నికల నియమావళిపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్ కేంద్రాల్లో ఓటర్లకు అనువుగా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. ఈవీఎం మెషిన్లపై ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఈవీఎంలను పరిశీలించారు. కార్యక్రమంలో గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ సాంబశివరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయాలకు మహర్దశ

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆలయాలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయాల అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. రూ.38 లక్షలతో ఏడుగంగమ్మల ఆలయ ఆధునీకరణ పనులు, రూ.2.90 కోట్లతో కుమారస్వామి ఆలయం(విజ్ఞానగిరి)లో మహా మండపం నిర్మాణం, శ్రీధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.70 లక్షలతో నిర్మించనున్న దుకాణ సముదాయానికి ఎమ్మెల్యే, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సంయుక్తంగా భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో పురాతన ఆలయాలను పునర్నిర్మిస్తుంటే ఊరందూరుకు చెందిన నాయకులు ఆలయాలను ఎందుకు కడుతున్నారంటూ విమర్శలు చేయడం ఎంత వరకు సబబని మండిపడ్డారు. బొజ్జల కుటుంబం 30 ఏళ్లు శ్రీకాళహస్తి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించి ఏనాడూ ఆలయాల అభివృద్ధికి, ప్రజలకు మంచి చేయలేదని పేర్కొన్నారు. తన హయాంలో ఏడుగంగమ్మల జాతరను రాష్ట్ర పండుగలా ప్రకటింపజేశామని, ఆర్డీవో కార్యాలయం తీసుకు వచ్చామని, పురపాలక సంఘాన్ని ఫస్ట్ గ్రేడ్‌కు తీసుకు వచ్చినట్లు స్పష్టం చేశారు. ఇవి టీడీపీ నాయకులకు కనిపించడంలేదా అని ఎద్దేవా చేశారు.

పదికి పదును



స్లిప్ టెస్టులు రాస్తున్న పదో తరగతి విద్యార్థులు



స్టడీ అవర్‌లో పదో తరగతి విద్యార్థులు

- ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ ప్రారంభం
- వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

చిల్లకూరు : పదో తరగతిలో ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. అదేవిధంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పిల్లల్లో తలెత్తే సందేహాలను నివృత్తి చేస్తూ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. పదో తరగతి పరీక్షల ఫలితాలపై పిల్లల భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. మంచి మార్కులు రావడం ద్వారా మంచి కళాశాలలో చేరేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా విద్యలో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకుంటారు. ఈ క్రమంలోనే వంద శాతం ఫలితాలు సాధించడంతో పాటు విద్యార్థులు మంచి తెచ్చుకునేలా ఉపాధ్యాయులు తమవంతు కృషి చేస్తున్నారు. గూడూరు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఫిబ్రవరి నెల మొదటి నుంచి ఉదయం స్టడీ అవర్స్, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. వారు కూడా మంచి మార్కులు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నారు. సబ్జెక్టుల వారిగా స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు.

అన్నింటిలోనూ వంద మార్కులు వచ్చేలా..

విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడమే కాకుండా ప్రతి సబ్జెక్టులోనూ వంద మార్కులు ఎలా తెచ్చుకోవచ్చన్న దానిపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రశ్నలను సులభంగా ఎలా అర్థం చేసుకోవాలని, వాటికి ఎంతమేర సమాధానాలు రాయాలి అన్న విషయాలను వివరిస్తున్నారు.

సాయంత్రం అల్పాహారం

ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి అల్పాహారం అందజేస్తున్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు సహకారంతో పిల్లలకు అల్పాహారం పెడుతున్నారు. దీంతో పిల్లలు ఉత్సాహంగా ఉండి చదువుకునే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

మండలం	ఉన్నత పాఠశాలలు	విద్యార్థులు
గూడూరు	09	497
చిల్లకూరు	09	352
కోట	08	389
వాకాడు	06	232
చిట్టమూరు	09	366

సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు



మేము ఇంగ్లీషు మీడియంలో పరీక్షలకు సిద్ధం అవుతున్నాం. గతంలో పదో తరగతి పరీక్షలకు రెండు పేపర్లు ఉండేవి. ఇప్పుడు ఒకే పేపరు కావడంతో అన్నీ ఒకే రోజున రాయాల్సి ఉంటుంది. సమాధాలను సులభంగా జ్ఞాపకం పెట్టుకునేలా ఉపాధ్యాయులు బోధిస్తున్నారు.
– ఎస్‌కే షాజీదా, 10వ తరగతి, పారిచెర్లవారిపాళెం

ప్రత్యేక తరగతుల ద్వారా ఎంతో మేలు



పదో తరగతి పరీక్షలంటేనే పిల్లల్లో ఒక విధమైన భయం ఏర్పడుతుంది. ప్రభుత్వం పాఠశాలలోని ఉపాధ్యాయుల ద్వారానే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేయడంతో భయం పూర్తిగా పోయింది. దీంతో పదో తరగతి పరీక్షలకు ప్రత్యేక తరగతులు ఎంతగానో మేలు చేస్తాయి.
– భినిత శ్రీ, 10వ తరగతి, చింతవరం

ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



ప్రతి పాఠశాలలోనూ ఇంగ్లీషు మీడియం పెట్టడంతో ఇంగ్లీషు అంటే భయం పోయింది. ప్రత్యేక తరగతుల నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం పూట స్లిప్ టెస్టులు పెడుతున్నారు. దీంతో పరీక్షలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన తగ్గింది. ప్రభుత్వం అందించిన విజయ దీపికలు ఎంతగానో ఉపయోడపతున్నాయి.
– డి.పవన్, 10వ తరగతి, చిల్లకూరు

వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు 40 రోజులుగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఈ ఏడు వంద శాతం ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తి చేయడంతో పాటు సబ్జెక్టుల వారిగా విద్యార్థులకు ప్రతి రోజూ పరీక్షలు నిర్వహిస్తున్నారు.
– శివసుబ్రమణ్యం, హెచ్‌ఎం, చింతవరం

రేపు మండల సర్వసభ్య సమావేశం

చిల్లకూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో భాను మూర్తి తెలిపారు. జనవరిలో మండల సమావేశం నిర్వహించారు. మార్చిలో నిర్వహించాల్సి ఉండగా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ క్రమంలో ముందస్తుగా సర్వసభ్య సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించి పలు అంశాలపై ఎంపీపీ తుపాకుల వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో చర్చించనున్నట్టు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



పిల్లలతో అక్షరాలు దిద్దిస్తున్న పండితులు

చిల్లకూరు : మండలంలోని పలు పాఠశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహం ఏర్పాటు చేసి చిన్న బిడ్డలకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. రేస పాఠశాలలో టీటీడీకి చెందిన వేద పండితులు పిల్లలకు పాఠశాల కరస్పాండెంట్ బాల చెన్నయ్య ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేశారు. మండలంలోని పలు ప్రాథమిక, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు



సైదాదుపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాయుడుపేట టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్టు ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రూప, మోనిక తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని తుమ్మూరు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష -2 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాలపురం సచివాలయం పరిధితో పాటు పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన 386 మందికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు సుబ్బారావు, నవీన్ కుమార్, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

104 వైద్య సేవలను వినియోగించుకోండి

రాపూరు: మండల ప్రజలు 104 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాజప్రమీల, భాను తెలిపారు. వారు బుధవారం కుమ్మరిగుంట, సైదాదుపల్లి గ్రామాల్లో రెండు 104 వాహనాల్లో వైద్య సేవలు అందించారు. వారు మాట్లాడుతూ ప్రతి రోజూ రెండు గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వైద్యశాలకు రాలేక ఇబ్బందులు పడకుడన్న ఉద్దేశంలో ప్రభుత్వం 104 వైద్య సేవలను అందిస్తోందని వివరించారు.

డ్రైవర్లకు సన్మానం

సూళ్లూరుపేట : స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా ఎస్ఐ రహీంరెడ్డి, రవాణాశాఖాధికారి అనిల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట డిపోలో 25 ఏళ్లుగా ప్రమాదాలు జరగకుండా బస్సులు నడిపిన డ్రైవర్లు హెచ్ వెంకటేశ్వర్లు, పీడీ రెడ్డి, ఎస్‌డీకే బాషాను సన్మానించారు. ఎస్ఐ రహీంరెడ్డి, రవాణాశాఖాధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు నియమాలను పాటిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మల్లికార్జున్, ఏఎంఎఫ్ రమేష్, హెడ్ క్లర్క్ ఆచారి, హలీం, యూనియన్ నాయకులు ఎం.శేఖర్, ఏ సుబ్రమణ్యం, కే జయరాజ్, ఎం సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లి ప్రత్యేక పూజలు



రుద్రమూర్తిగారి మఠంలో ప్రత్యేక పూజలు చేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం వెంకటగిరిలో విస్తతంగా పర్యటించారు. ముందుగా పట్టణంలోని బంగారుపేటలో రూ.1.50 కోట్లతో రామలింగ చాముండేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. మనులాలపేటలో పునఃనిర్మాణమైన రుద్రమూర్తి మఠం ఆలయం, యాగశాలలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. 4వ వార్డులోని వైఎస్సార్ సీపీ నేత మోహన్‌రావు కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొని వరుడు నాగార్జున్‌ను ఆశీర్వదించారు. వెలమపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ నేత వల్లభనేని ప్రసాద్ ఉత్తర క్రియల్లో పాల్గొని ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా విజయ గణపతి బ్రహ్మోత్సవాలు



వెంకటేశ్వర స్వామి కల్యాణం చేస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని విజయగణపతి ఆలయంలో బుధవారం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. ఉత్సవమూర్తికి ప్రాణప్రతిష్ట చేసి అష్టోత్తర కమల లక్ష్మీ గణపతి హోమం చేపట్టారు. అనంతరం వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న దాతలను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, బాలాజీ దంపతులు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ బైనా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు చైర్ పర్సన్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి విజయ గణపతి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి నగరోత్సవం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, శాశ్వత ఉభయకర్తలు, అనుగ్రహ సేవా సమితి సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ చూపాలి



భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

చిల్లకూరు : ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో-2 రవూఫ్ ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక ఎమ్మార్సీలో ఉన్న భవిత కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు కల్పించిన వసతులు, ఆడుకునే బొమ్మలు, పుస్తకాలు, రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపి చేయించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. క్రమం తప్పకుండా పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు బొమ్మి నాగరాజు, లలిత తదితరులు పాల్గొన్నారు.

రావిగుంటపాళెంలో రక్తదానం



సర్టిఫికెట్లు అందజేస్తున్న వైద్యులు, నేతలు

వాకాడు: మండలంలోని రావిగుంటపాళెంలో బుధవారం మాతృభూమి సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్వామా దాడిలో అమరులైన భారత సైనికుల ఆత్మకు శాంతికి చేకూరాలని నివాళులర్పించారు. అనంతరం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో 50 మందికి పైగా యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వారికి వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సందీప్, శ్రీనివాసులు, సంస్థ నిర్వాహకులు ప్రసాద్, పృథ్వీ, శ్రీనివాసులు, రాజేష్, ధీరు, రమేష్, ప్రభు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



సరస్వతి శిశుమందిరంలో పిల్లలతో అక్షరాలు దిద్దిస్తున్న పండితులు

గూడూరు రూరల్ : వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం గూడూరులోని సరస్వతి శిశు మందిరంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పటేల్ వీధిలోని సాయిసత్సంగ నిలయంలో విజయదుర్గ అమ్మవారికి సరస్వతి అలంకరణ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు సమరసత సేవా ఫౌండేషన్ కో ఆర్డినేటర్ కోట సునీల్ స్వామీ చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయించారు. అలాగే రూరల్‌లోని పారిచెర్లరాజుపాళెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు క్రిష్ణమరాజు ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షులు రోహిణి, జమున, స్నేహలతరెడ్డి, శశిరేఖ, లక్ష్మీ, జయజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనుల్లో నాణ్యత పాటించాలి



హెచ్‌ఎంలతో సమీక్షిస్తున్న కో ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి

గూడూరు రూరల్ : నాడు-నేడు పనుల్లో నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని నాడు-నేడు పనుల జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి హెచ్చరించారు. ఆయన బుధవారం స్థానిక ఎమ్మార్సీలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఎంఈవోలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ తొలి విడతలో చేపట్టిన నాడు- నేడు పనుల్లో మిగిలిన సొమ్మును రెండవ విడతలో చేపట్టిన పనులకు బదలాయించాలన్నారు. రెండవ విడతలో చేపట్టిన నాడు- నేడు పనులు కూడా త్వరగా పూర్తి చేసేలా హెచ్‌ఎంలు చొరవ చూపాలని తెలిపారు. తొలి విడతలో 40, రెండవ విడతలో 33 పాఠశాలల్లో పనులు చేపట్టినట్టు తెలిపారు. ఎంఈవోలు సనత్‌కుమార్, కాంచన తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఎల్లసిరికి ఘన నివాళి



ఎల్లసిరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గూడూరు రూరల్ : మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డికి బుధవారం పలువురు నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన ద్వితీయ వర్ధంతి సందర్భంగా చెన్నూరులోని బస్టాండ్ వద్ద అన్నదానం చేశారు. అంతకుముందు ఆయన కుమారుడు ఎల్లసిరి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎల్లసిరి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శివకుమార్, భాస్కరరెడ్డి, ఎంఆర్‌పీఎస్ నాయకులు గోవింద్ శంకరయ్య, రాఘవేంద్ర, బాబు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు అవసరం



మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ ఏవో ఆనందరెడ్డి

బాలాయపల్లి(డక్కిలి): మిరపలో సస్య రక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వెంకటగిరి ఉద్యాన శాఖ ఏడీఏ ఆనంద్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం బాలాయపల్లి మండలం కామకూరులో మిరప పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా భూమి సారవంతమవుతుందన్నారు. మిరప పంటకు ఎర్రనేలలు, నల్ల రేగడి నేలలు అనువుగా ఉంటాయని సూచించారు. మిరపను ఆకుముడత తెగులు సోకుతుందన్నారు. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ లేదా డైనోటెఫ్యూరాన్ మందు పిచికారీ చేయాలన్నారు. విత్తనం విత్తేముందు విత్తను శుద్ధి చేయాలని సూచించారు. కిలో విత్తనాన్ని 8 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్‌తో శుద్ధి చేస్తే రసం పీల్చే పురుగుల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. మిరప నారు నాటేటప్పుడు ఎకరాకు 10-12 కిలోల కార్బోఫ్యూరాన్ (3జీ) గుళికలు వేయాలన్నారు.

అగ్రిగోల్డ్ భూముల్లో ట్రెంచ్ ఏర్పాటు



అగ్రి గోల్డ్ భూముల చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేస్తున్న జేసీబీ

చిల్లకూరు : మండలంలోని ఎగువరాజుపాళెం సమీపంలో ఉన్న అగ్రి గోల్డ్ భూముల వద్ద బుధవారం ట్రెంచ్ ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల క్రితం రాత్రి పూట కొంత మంది ఆ భూముల్లో తవ్వకాలు చేపట్టారు. ఈ విషయంపై ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ అధికారులు బుధవారం ఆ భూముల్లోకి వాహనాలు వెళ్లకుండా ట్రెంచ్ ఏర్పాటు చేశారు. అగ్రి గోల్డ్ సంస్థ వివాదాల్లో ఉండడంతో సంస్థ పేరుతో ఉన్న వందల ఎకరాల భూమిని సీఐడీ స్వాధీనం చేసుకుంది. ఆ భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు కొంతమంది భారీ యంత్రాల ద్వారా తవ్వకాలు చేపట్టి సుమారు 40 టన్నుల వరకు తెల్ల రాయిని వెలికి తీసి అక్కడే వదిలి వేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు ఆ భూములను పరిశీలించి చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో ఓడూరు వీఆర్వో సుబ్రమణ్యం జేసీబీతో ట్రెంచ్ తవ్వించారు.